# గొడుగు

★ రాజా ★

శంకరం మేష్టారు మా యింటికి వచ్చారు ఏదో పనిమీద, కాస్సేపు ఆ కబురూ, ఈ కబురూ చెప్పి, తిండి విషయంలో ఏమీ మొహమాట పడకుండా శుభ్రంగా ఫలహారంచేసి లేచారు

యింతట్లోకే మబ్బులు కమ్మి, ఆకాశంలోంచి గర్జన వినిపించింది యిట్టే నల్లటి మేఘాలు కమ్మాయి. కిటికీలోంచి చల్లటిగాలి తగిలింది. నేను కిటికీ మూసేంతట్లోకే జల్లు ఆరంభమయింది.

మేము తిరిగి వెనక్కి తిరిగి కుర్చీల్లో కూర్చున్నాము ఎంతకీ జల్లు తగ్గలేదు శంకరం మేష్టారు మట్టుకు వెళ్లిపోతానని లేచారు.

"నేను వెళిపోవాలి. చాలా అర్జంటుపని ఉంది నాకు."

"కాస్సేపు....కూర్చోండి"

"అహఁ, చాలా అవసరం, మీ దగ్గిర గొడుగుంటే ఒకసారి యిస్తారూ? రేపొద్దున్న ఎనిమిదింటికల్లా మీకు పంపించేస్తాను. తప్పకుండా."

"దానికేముందిలెండి?— శారదా, వంటింట్లో మూలనిపెట్టాను గొడుగూ, అది లాపట్రా" అని కేకేశాను.

శారద వినిపించుకోకుండా సావిట్లో మూలపెట్టిన నా కొత్త గొడుగుతీసుకొచ్చింది. నాకు అమాంతం శారదని నాలుగు దెబ్బలు యిచ్చుకోవాలన్నంత కోపం వచ్చింది.

అది చూస్తూనే శంకరం మేష్టారు కళ్లు పెద్దవి చేసి గొడుగు చేతుల్లో తిప్పుతూ పరీక్షగా చూస్తున్నారు.

"ఇప్పుడు బజార్లో అంతటా, యివి కనిపిస్తున్నాయి సుమండీ, సరిగ్గా యిదేరకం గుడ్డ, యిదేరకం పిడీ. ఎంతిచ్చికొన్నారేమిటి?"

"పద్దెనిమిదింబావలా."

"అబ్బ! చాలా ఖరీదుగా ఉంది ఎవ్వరికీ ఎరువియ్యకూడదు యిలాంటివి." అంటూ ఆయన తీసుకు చక్కాపోయారు.

ఆయన వెళ్ళగానే నేను శారదకేసి ఉరిమి చూసి, "ఇదుగో, నీకేమాత్రం జ్ఞానంలేదేం? వంటింట్లో మూలఉన్న పాతగొడుగు యిమ్మంటే మొన్న కొన్న కొత్త గొడుగు సమర్పించావేం? అది వస్తుందని ఆశలేదు" అన్నాను.

శారదమట్టుకు నవ్వుతూ, "బొత్తిగా అంత అనుమానమయితే ఎలాగండీ? మేష్టారు- అందులోనూ శంకరంమేష్టారంత పెద్దమనుషులెవరున్నారు? మరిచోద్యం!" అంది.

ఏమిటో! ఈ ఆడవాళ్ళని బొత్తిగా యింత అమాయకంగా ఎందుకు పుట్టిస్తాడో దేవుడు! రేపు దానికోసం నానాపాట్లూ పడితేనేగాని దక్కదు కావును!

అంతే అనుకున్నట్టే జరిగింది తెల్లారినా ముసురు యింకా జోరుగాఉంది. గొడుగు రాలేదు. ఆ గొడుగులేకపోతే ఆఫీసుకెళ్ళడం లాభంలేదు. ఏమీతోచక గదిలో తచ్చాడుతున్నాను అటూ యిటూ.

ఇంతట్లో శారద కాఫీ తీసుకొచ్చింది. వెంటనే "చూశావా? గొడుగురాలేదు ఎలా వెళ్ళమంటావు యిప్పుడు ఆఫీసుకి? ఆ పాత చింకి గొడుగు తీసికెడితే వాన ఆపదుసరిగదా నలుగురూ నవ్వుతారు కూడానూ, నువ్వే ఈ కష్టాలన్నిటికీ కారణం!" అన్నాను.

శారదమూర్తి ముడుచుకుని కూర్చుంది. తొమ్మిదయింది. నేను విస్తరి దగ్గిర కూర్చున్నాను గాని నాకేమీ అన్నం సహించలేదు

చివరికి ఎల్లాగో రెండు మెతుకులు కొరికి బట్టలు వేసుకుని, ఆ చింకిగొడుగునే వేసుకుని బయలుదేరాను జనం నావేపు ఆశ్చర్యంగా చూశారు, "ఆఫీసరుకి చింకిగొడుగేమిటని". నేను మట్టుకు చకచకా నడిచి వెళ్ళిపోయాను మూతి ముడుచుకుని. దీనికంతకీ కారకుడైన శంకరం మేష్టారికి పెట్టవలసిన శాపనార్థాలన్నీ పెట్టాను మనస్సులో.

సాయంత్రం చీకటిపడుతుండగా యింటికొచ్చాను. వస్తూనే, "గొడుగువచ్చిందా?" అని అడిగాను శారదని.

"ఆ . మీ మేష్టారు పంపించారు ఓ కుర్రాణ్ణి ఏదో ఒక గొడుగు .."

"చాలు. మేష్టరట! చిన్నప్పుడెప్పుడో చదువు చెప్పాడని యిచ్చినందుకు చాలా బాగా చేశాడు. సరే ఏదీ గొడుగు "

ఆనందవాణి

పోస్టుబాక్సు నెంబరు

1583

— మేనేజరు

"అది మనదికాదు. అదేదో ఒక పాత చింకి గొడుగు అది మనదికాదని చెప్పి ఆ కుర్రాణ్ణి పంపించేశాను "

వెంటనే శంకరంగారి దగ్గిరకెళ్ళి చీవాట్లు పెడదామనుకున్నాను కాని పగలంతా పనిచేసివచ్చానేమో చాలా అలసటగా ఉంది అందుచేత ఆరాత్రికి పడుకున్నాను ఆ రాత్రి తెల్లవార్లూ శంకరం మేష్టారూ, గొడుగూ కళ్లో కనిపిస్తూనే ఉన్నాయి.

మర్నాడు ప్రొద్దున్న నేను బట్టలు మార్చుకొంటూండగా వచ్చింది గొడుగు అదేపిడీ, అదే గుడ్డా. నేను వెంటనే సంతోషంగా అది అందుకుని అమాంతం కౌగలించుకున్నాను

మధ్యాన్నం నేనూ, శాస్త్రీ టిఫిన్ తీసుకొంటున్నాం. నేను శంకరం మేష్టారి గొడుగు కథ యావత్తూ చెప్పాను

"ఆశ్చర్యంగావుంది!" అన్నాడు అంతావిని

"ఏం?"

"నాదగ్గిరనించికూడా ఒక గొడుగు కొత్తది తీసికెళ్లాడు ఇంతవరకూ ఇవ్వనేలేదునాకు. అది లేకుండా నాకు నానా యిబ్బందీ అవుతోంది."

శాస్త్రిగది చుట్టుపక్కల కలియజూశాడు నేను ఆ గొడుగుని ఒక బీర్వా మూలపెట్టాను ఎవరూ చూడకుండా. చూస్తే అడుగుతారనే భయంతో. పిడిమట్టుకు పైకి కనిపిస్తోంది కొద్దిగా.

శాస్త్రి గబగబా అక్కడికి పరుగెత్తి, గొడుగు బయిటకితీసి యిప్పి పరీక్షించి, పిడితిప్పి సంతోషంగా ఒక్క కేక వేశాడు.

"అమ్మయ్య! ఎలాగైతేనేం దొరికింది." అని.

"ఏమిటదీ? అలా అంటావేం?"

"ఇది నాది."

"అబద్ధం నేను కొన్నాను మొన్న మొన్ననే."

"అబద్ధం! ఎవరిదబద్ధమో ఈ పిడిచూడు." అని ఆ పిడి చూపించాడు

దానిమీద చిన్నచిన్న అక్షరాలతో అతనిపేరు రాసి ఉంది!!